

రూ.లక్ష విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కొలగాని వీవీఎస్ మూర్తి, రత్నశ్రీ దంపతులు (కాకినాడ) మంగళవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రేపటి నుంచి రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్

పిఠాపురం: రేపటి నుంచి ఈ నెల 17 వరకూ పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 1,18,431 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టా కాలువలకు 12,950 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 2,250, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సంసిద్ధత



లారెస్ సంస్థ నిర్మించనున్న విశ్రాంతి షెడ్డు నమూనా

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయ పశ్చిమ రాజగోపురం ముందు భారీ విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన లారెస్ ఫార్మాస్యూటికల్స్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీవీ రవికుమార్ దేవస్థానానికి మంగళవారం లేఖ పంపించారు. సుమారు రూ.1.5 కోట్ల వ్యయంతో 125 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పున 12,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో టెన్సిల్ షెడ్డు నిర్మించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. సుమారు 3 వేల మంది భక్తులు ఈ షెడ్డులో సేద తీరే అవకాశం ఉంది. రాత్రి వేళ కూడా విశ్రాంతి తీసుకునే వీలుంటుంది. వసతి గదుల కోసం భక్తుల నుంచి ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఈ షెడ్డులో భక్తుల కోసం వ్రతాలు, దర్శనం, ప్రసాదం కౌంటర్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. పెద్ద పెద్ద హెలికాప్టర్ ఫ్యాన్లు కూడా అమర్చనున్నారు. ఈ ప్రతిపాదనను త్వరలోనే దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ దృష్టికి తీసుకువెళ్లి, షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. ఇప్పటి వరకూ పశ్చిమ రాజగోపురం ఎదురుగా నిలువ నీడ లేక భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండాకాలంలో అక్కడి చెట్ల కిందనే తలదాచుకోవల్సిన దుస్థితి. అదే వర్షాకాలమైతే తడిసి ముద్దవుతున్నారు. షెడ్డు నిర్మాణం జరిగితే భక్తులకు ఈ బాధలు తప్పుతాయి.

22న ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సత్యదేవుని సన్నిధిలో సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు.

సర్కారు వారి షరతులు



జిల్లాలో మొత్తం బస్సులు	283
పల్లెవెలుగు	167
అల్ట్రా పల్లెవెలుగు	67
ఎక్స్‌ప్రెస్	37
ఇతరం	12
ప్రయాణికులు	89,000
మహిళలు	30,000 మందికి పైగా

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆంక్షలు
- మొత్తం బస్సు సర్వీసులు ఏడు రకాలు
- నాలుగింటికి మాత్రమే 'ఉచితం'
- నాన్‌స్టాప్‌లలో ప్రయాణానికి నిరాకరణ
- అంతంత మాత్రంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు

ఎక్కడైనా తిరగవచ్చన్నారు

గత సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలన్న తలంపుతో రాష్ట్రమంతటా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక నాలుక మడత పెట్టేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ మార్గదర్శకాలు వెలువరించారు. కేవలం ఈ బస్సులలో మాత్రమే ఉచిత ప్రయాణమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎక్కడా చెప్పలేదు. పైగా ఈ బస్సులకే పరిమితం చేస్తే రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణం ఎలా సాధ్యమనే ప్రశ్న ఎదురవుతోంది. అధికారం చేపట్టిన ఏడాది తరువాత ఈ పథకాన్ని అమలు చేస్తూ.. చంద్రబాబు తన కుతంత్రాన్ని బహిర్గతం చేశారని మహిళలు మండిపడుతున్నారు. చిరు వ్యాపారులు, చిరుద్యోగులు, విద్యార్థినులు పట్టణాలకు వెళ్లాలంటే ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ సర్వీసులే ఎక్కువగా ఉంటాయి. వాటిలో ఉచిత ప్రయాణానికి అనుమతించకపోతే దీనివల్ల ఉపయోగమేమిటని ప్రశ్నిస్తున్నారు.

సాక్షి, రాజమహేంద్రవరం: ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణంపై కూటమి సర్కారు పలు ఆంక్షలు పెట్టింది. ఆర్టీసీలో తొమ్మిది రకాల బస్సు సర్వీసులుండగా కేవలం ఐదు రకాలకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మాత్రమే ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, సప్తగిరి, ఏసీ బస్సులకు ఉచిత ప్రయాణం వర్తించదు. అంతర్రాష్ట్ర సర్వీసులు, స్పెషల్ బస్సుల్లో సైతం ఉచితం లేదు. ఉచితంగా ప్రయాణించాలనుకునే మహిళలు రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. రాష్ట్రంలోనే నివసిస్తున్నట్లు ధ్రువీకరణ చూపించాలి. రాష్ట్ర సరిహద్దుల వరకే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఉచిత ప్రయాణం అమలుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. దీనిని కొన్ని రకాల బస్సులకు మాత్రమే పరిమితం చేస్తే ఉపయోగమేమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు.



ఉచిత ప్రయాణం.. కొన్ని బస్సులకేనా..!

నాన్‌స్టాప్‌లో నో ఎంట్రీ

ఆర్టీసీలో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్ బస్సులనే నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. అయినప్పటికీ వీటిల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించరు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ, నాన్‌స్టాప్ బస్సులే నడుస్తున్నాయి. వీటిల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం మహిళలకు ఉండదు.

టికెట్ జారీ ఇలా..

స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణానికి టికెట్ జారీ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. బస్సు ఎక్కేచోటు నుంచి దిగే ప్రాంతం వరకూ టికెట్ ఇస్తారు. టికెట్ విలువను సున్నాగా నమోదు చేస్తారు. టికెట్లు జారీ చేసే మెషీన్(టిమ్)లో ప్రత్యేకంగా వుమెన్ ఫ్రీ టికెట్ (డబ్ల్యూఎఫ్‌టీ) పేరిట ప్రత్యేకంగా బటన్ ఏర్పాటు చేశారు. బాలికలు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లకు జీరో ఫేర్ టికెట్ ఇస్తారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఉచిత ప్రయాణం చేయాలంటే కండక్టర్‌కు గుర్తింపు కార్డు తప్పనిసరిగా చూపాలి. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్, స్థానికతను ధ్రువీకరించే ఏదో ఒక కార్డు చూపడం తప్పనిసరి.

బస్సులు పెంచకుండానా..

జిల్లాలో 2011 లెక్కల ప్రకారం 18,32,332 జనాభా ఉంది. పురుషులు 9,11,520, అత్యధికంగా స్త్రీలు 9,20,812 మంది ఉన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య 10 లక్షలకు పైగా ఉండే అవకాశం ఉంది. ఇంత మంది మహిళలున్న జిల్లాలో 271 బస్సులలో మాత్రమే ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్సులలో ప్రతి రోజూ 83 వేల మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరిలో 30 వేల మందికి పైగా మహిళలుంటున్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే మరో 10 నుంచి 20 శాతం మంది అధికంగా ప్రయాణించే అవకాశముంది. అందుకు తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి నివేదికలను పంపినా స్పందన లేదు.

ప్రస్తుతం డిపోల్లో బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ఉన్న బస్సులలో కూడా చాలా వరకూ కండిషన్‌లో లేవు. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల్లో మొత్తం 283 బస్సులున్నాయి. వీటిలో పల్లెవెలుగు 167, అల్ట్రా 67, ఎక్స్‌ప్రెస్ 37, ఏసీ బస్సులు 12 చొప్పున ఉన్నాయి. గ్రామీణ జనాభా అధికంగా ఉన్న జిల్లాలో ఆర్టీసీ సేవలు ఇప్పటికే అంతంత మాత్రంగా ఉంటున్నాయి. పలు రూట్లలో సైతం బస్సులు తక్కువగా ఉన్నాయి. డ్రైవర్, కండక్టర్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నా ప్రభుత్వం వాటిని భర్తీ చేయడం లేదనే ఆరోపణలున్నాయి. మరోవైపు రోడ్లకు మరమ్మతులు సైతం ప్రభుత్వం చేపట్టకపోవడంతో ఆర్టీసీ సేవలపై ఏడాదిగా విమర్శలొస్తున్నాయి. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ.. ఉన్న బస్సులతోనే కానిచ్చేసి.. పథకం అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకొనేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

ఆ 25 గ్రామాల పరిస్థితేమిటి?



ఆదాయం రావడం లేదనే కారణంతో జిల్లా వ్యాప్తంగా 25 గ్రామాలకు కనీసం పల్లెవెలుగు బస్సులను కూడా ఆర్టీసీ నడవడం లేదు. రాజమహేంద్రవరం డిపో పరిధిలో 12, గోకవరం పరిధిలో 4, కొవ్వూరు 8, నిడదవోలు డిపో పరిధిలో 5 గ్రామాలకు ఆర్టీసీ బస్సు వెళ్లడం లేదు. ఆయా గ్రామాల ప్రజల తమ ప్రయాణాలకు ఆటోలపై ఆధారపడుతున్నారు. ప్రస్తుతం ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆయా గ్రామాల ప్రజల పరిస్థితేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఉన్న పల్లె వెలుగు సర్వీసులను ఉచిత స్కీమ్‌కు వినియోగిస్తే జిల్లాలోని ఏ గ్రామీణ ప్రాంతానికీ బస్సులు నడిచే పరిస్థితులుండవని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో వైద్యుల కొరత



ఎంసీహెచ్‌లో నూతన బ్లాకులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల్లోని సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 59 శాతం ఖాళీలు ఉన్నాయని, ఆయా విభాగాల్లో డాక్టర్ల కొరతను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్‌లో చిన్నపిల్లల ఐసీయూలతో నిర్మించిన రెండంతస్తులను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం కింద కేంద్రం అందించే రూ.11 కోట్లతో వీటిని నిర్మించామన్నారు. రెండో అంతస్తులో పీడియాట్రిక్ ఐసీయూ, ఎన్ఐసీయూ, స్టెప్ డౌన్ హెచ్‌డీయూ విభాగాలు, 25 పడకలతో రెండు వార్డులు, మూడో అంతస్తులో నవజాత శిశువుల సంరక్షణకు ఉద్దేశించిన ఎస్ఎన్‌సీ-1, ఎస్ఎన్‌సీ-2 తల్లుల వార్డు, ఈఎన్‌టీ, చర్మవ్యాధుల కేంద్రం ఉన్నాయని వివరించారు. పిల్లల వార్డులో 75, తల్లుల వార్డులో 25 చొప్పున పడకలు ఏర్పాటు చేశామన్నారు. రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఓపీ కౌంటర్లను 4 నుంచి 22కు పెంచామన్నారు. వీల్ చైర్లు ఏర్పాటు చేశామని, మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరిచామని చెప్పారు. వచ్చే నెల నుంచి రొమ్ము, సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిని గుర్తించేందుకు ఎన్‌సీడీ-3 సర్వే ప్రారంభిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్ల నివారణకు ప్రముఖ అంకాలజిస్ట్ నోరి దత్తాత్రేయుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారన్నారు. పాడేరు, పిడుగురాళ్ల, మచిలీపట్నం వైద్య కళాశాలలకు రూ.352 కోట్లు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ వెంకటేష్, సూపరింటెండెంట్ డాక్టర్ జి.రాజశేఖర్ కెనడీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్డియాక్ అరెస్ట్ కేసుల నేపథ్యంలో సీపీఆర్ శిక్షణ అవసరం



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం. చిత్రంలో సున్నా తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశంలో కార్డియాక్ అరెస్ట్ కేసులు పెరుగుతున్నందున సీపీఆర్ శిక్షణ చాలా అవసరమని, ఎలాంటి సమయంలోనైనా తక్షణమే ప్రతిస్పందించగలిగే ఈ సీపీఆర్ నైపుణ్యాలు నేర్చుకోవడం ప్రతి ఒక్కరికి చాలా ముఖ్యమని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. మంగళవారం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల్లో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయిన వ్యక్తికి సహాయం చేసే ప్రక్రియ అన్నారు. రోటరీ క్లబ్ రివర్ సిటీ ప్రెసిడెంట్ ఎల్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి, ఒత్తిడి స్థాయిలు పెరగడంతో యువకుల్లో సైతం కార్డియాక్ అరెస్ట్ ఘటనలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. గుండె ఆగిన మనిషిని దగ్గరలో గల హాస్పిటల్‌కు తీసుకుని వెళ్లేలోగా అతనికి సీపీఆర్ చేస్తే తిరిగి గుండెను పనిచేయవచ్చునని తెలిపారు. సీపీఆర్ ఎలా చేయాలో డాక్టర్ వేణుగోపాల్‌నోరి, డాక్టర్ ప్రియాంక తెలిపారు. రోటరీ క్లబ్ రివర్ సిటీ సెక్రటరీ ఎ.దీపిక, పీడీపీ భాస్కరరామ్, ఏజీవీవీఎస్ కృష్ణారావు, జోనల్ కమ్యూనిటీ చైర్‌పర్సన్ ఎస్.నాగేంద్రకిషోర్, తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలోచనలకు పదును పెడితే

నూతన ఉత్పత్తులు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కుష్వంత్ కుమార్

రాజానగరం: ఆలోచనలకు పదును పెడితే నూతన ఉత్పత్తుల తయారీకి అవకాశం ఉంటుందని, తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్‌లోని మేడివాలీ ఇంక్యుబేషన్ కౌన్సిల్ శాస్త్రవేత్త డాక్టర్ కుష్వంత్ కుమార్ శీరంరెడ్డి అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో మంగళవారం నిర్వహించిన ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డే ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినూత్న ఆలోచనలను ఉత్పత్తులుగా మార్చడంలో యూనివర్సిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అంకుర పరిశ్రమల స్థాపనకు మౌలిక వసతులు సమకూర్చడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో రెండు వేల వరకూ అంకుర పరిశ్రమలు ఉన్నాయని, ముఖ్యంగా ఆరోగ్య రంగానికి సంబంధించిన స్టార్టప్స్‌కు పూర్తి సహకారం అందిస్తామన్నారు. అనకాపల్లి రూరల్ ఇన్క్యుబేషన్ సెంటర్ సీఈఓ శ్రీరామ్ భగవతుల మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక అవకాశాల గురించి ప్రస్తావిస్తూ, స్థానిక యువత పరిసరాలలోని సమస్యలను సాంకేతిక సాయంతో పరిష్కరించే దిశగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) మాట్లాడుతూ కొత్త ఆలోచనలతో ఉత్పత్తులను తీసుకురావడం, వాటికి మార్కెట్ చేయడం ద్వారా భవితకు బంగారు బాట వేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ప్రొ.చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ యూనివర్సిటీ ప్రాంగణంలో 25 వరకు అంకుర పరిశ్రమల ఏర్పాటుకు రిజిస్టర్ అయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఎస్ఆర్‌డబ్ల్యూ వాణిధర్, జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ వై.మురళీధరరెడ్డి, వాద్వానీ ఫౌండేషన్ డైరెక్టర్ దయాకర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొన ఊపిరికి కొత్త ఊపిరి

- ధన్య చరితులు.. పుణ్యమూర్తులు
- వారి త్యాగం చైతన్యానికి ప్రతీక
- కన్ను మూస్తూ.. మరొకరికి జన్మనిస్తున్న దాతలు
- నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

కపిలేశ్వరపురం: ఆలోచన అయినా ఆచరణ అయినా బొందిలో ప్రాణం ఉన్నంత వరకే. మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులు తీసుకొన్న సామాజిక అవగాహనతో కూడిన నిర్ణయాలు మరణించిన వ్యక్తిని మరెన్నో తరాలు జీవించేలా చేస్తాయి. అలాంటి కోవలోకి వచ్చే అవయవదానం సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎంతోమంది తమ అవయవాలను దానం చేసి ఎంతోమందికి ప్రాణం పోశారు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

పెరిగిన అవసరం

భారతదేశంలో అవయవాలు సకాలంలో అందుబాటులో లేక రోజుకు 20 మంది చొప్పున చనిపోతున్నారని అంచనా ఉంది. ప్రతి పది నిమిషాలకు ఒకరు అవయవ మార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితి దేశంలో ఉంది. అవయవాలు అవసరమైన వారిలో పది శాతం మందికి కూడా అవి లభ్యం కావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అవయవదానం ప్రాధాన్యం పెరిగింది. సాహితీవేత్తలు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్తలు మరణానంతరం తమ దేహాలను దానం చేస్తూ అంగీకార పత్రాలను రాసిన చరిత్ర ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకి ఉంది.

బ్రెయిన్ డెత్ కావడంతో...

మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన యువకుడు నున్న శివన్నారాయణ (శివ) ఈ ఏడాది మే 25న రాజమహేంద్రవరం - ద్వారపూడి రహదారిలో ప్రమాదానికి గురికావడంతో బ్రెయిన్ డెత్ అయ్యింది. కుటుంబ సభ్యుల నిర్ణయంతో కాకినాడ ట్రస్ట్ ఆసుపత్రిలో అతని అవయవాలను దానం చేయడం ద్వారా ముగ్గురికి జీవితాన్ని ప్రసాదించాడు. లివరు, ఒక కిడ్నీని ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి, మరో కిడ్నీని విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి అమర్చారు. రెండు నేత్రాలలోని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

చేయడం ఇలా..

దాతలు జీవిస్తూనే వారి అవయవాలలో కొంత భాగాన్ని దానం చేస్తూ ఇతరులకు ఊపిరి పోస్తున్నారు. రక్తాన్ని, 50 శాతం కాలేయాన్ని, రెండింటిలో ఒక కిడ్నీని ఇతరులకు దానం చేయడం ఈ కోవలోనివే. మరొక పద్ధతిలో వారు చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యుల నిర్ణయంతో అవయవాలు దానం చేస్తున్నారు. బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తుల్లో మొత్తం రెండు కిడ్నీలను, గుండెను, కాలేయాన్ని, ఊపిరితిత్తులను, ప్యాంక్రియాసిస్ గ్రంధిని వాటి పనితీరు సామర్థ్యాన్ని బట్టి ఇతరులకు దానం చేస్తున్నారు. తన దేహాన్ని మరణానంతరం వైద్య కళాశాల విద్యార్థుల పరిశోధన కోసం కళాశాలకు అప్పగించాలంటూ కొందరు ముందస్తు ఒప్పంద పత్రాన్ని రాస్తున్నారు. సహజ మరణం పొందిన వారి నుంచి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాలు దానం చేసే వీలు ఉంది.



ఈ ఏడాది మే 28న బ్రెయిన్ డెత్‌తో అవయవ దానం చేసిన శివన్నారాయణ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మండపేట నియోజకవర్గ నాయకులు (ఫైల్)

చిరంజీవులయ్యారు



మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాకర శ్రీనివాసరావు ఈ ఏడాది జూలై 12న గుండెపోటుతో మృతిచెందగా ఆయన నేత్రాలను అనపర్తి రాధాకృష్ణ ఐ బ్యాంక్‌కు దానం చేశారు. తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామానికి చెందిన ధూలిపూడి సీతారాం అనే మహిళ ఈ ఏడాది జులై 1న గుండె పోటుతో మరణించగా నేత్రదానం చేశారు. తాళ్లరేవు మండలం వూడా హిమావతి ఈ ఏడాది జనవరి 26న గుండెపోటుతో మరణించడంతో రెండు నేత్రాలను కాకినాడ బాదం ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ద్రాక్షారామ పద్మ స్టూడియో అధినేత కె.వీర్రాజు ఈ ఏడాది మే 28న మృతి చెందగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన పలపకూర వెంకట్రావు ఏడాది ఏప్రిల్ 26న గుండె పోటుతో మరణించగా కాకినాడ రెడ్ క్రాస్ ఐ బ్యాంకుకు రెండు కార్నియాలను దానం చేశారు. కె.గంగవరం గ్రామానికి చెందిన చింత చిన్నారి ఈ ఏడాది ఫిబ్రవరి 27న మృతి చెందగా రెండు నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు.

వైద్య విద్యార్థుల పరిశోధన లక్ష్యంగా..

కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, ఆలయ శిల్పి పెద్దింశెట్టి సూర్యనారాయణమూర్తి (91) 2021 డిసెంబర్ 8న వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే 2009 నవంబర్ 22న కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహదాన ఒప్పంద పత్రాన్ని రాసి ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆ మేరకు సూర్య నారాయణమూర్తి దేహాన్ని కళాశాలకు అప్పగించారు. పిఠాపురానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, వజ్రాయుధం పుస్తక రచయిత ఆవంత్స సోమసుందర్ 2016 ఆగస్టు 12న వృద్ధాప్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. పిఠాపురం పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మేకా సత్యనారాయణ శాస్త్రి (బాంబు) తానూ, తన భార్య అనూరాధ ఇద్దరూ తమ దేహాలను వైద్య కళాశాలకు రాసి ఇచ్చారు. కాగా 2022 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ డే రోజున సత్యనారాయణశాస్త్రి గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు రాజానగరం జీఎస్ఎల్ కళాశాలకు దేహాన్ని అప్పగించారు. ఆ స్ఫూర్తితో అదేరోజు సత్యనారాయణ శాస్త్రి కుమారుడు గౌరవ్, కోడలు కల్యాణిలు తమ దేహాలను దానం చేసేందుకు ఒప్పంద పత్రాలను రాసి ఇచ్చారు.

నాన్న స్ఫూర్తితో దేహదానం చేశాం



నాన్న మానవ సమాజం పట్ల అవగాహనతో జీవించారు. నా చిన్ననాటి నుంచీ అనేక విషయాలు బోధించారు. ఆయనతో పాటు అమ్మకు అవగాహన కల్పించి ఆమె దేహాన్ని కూడా దానం చేసేందుకు చైతన్య పర్చారు. ఆ స్ఫూర్తితో నేను, నా జీవిత భాగస్వామి కల్యాణి కూడా దేహదానం చేసేందుకు పత్రం రాశాం.

– మేకా గౌరవ్, పిఠాపురం, కాకినాడ జిల్లా